# షో కేస్!

**సెక్రెటేరియట్** పక్కన ఉన్న హోం సైన్సు కాలేజీలో నుంచీ బయటికి వస్తూంది సునయన.

"హాయ్ స్మార్టీ!" అన్నాడు అక్కడే వెయిట్ చేస్తున్న రవీంద్ర.

అతని గొంతు వినగానే సంభ్రమంగా తిరిగి చూసింది సునయన. ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిసిన కాక్‌టెయిల్ లాంటి భావం ఆమె విశాల నేత్రాలలో కనబడింది.

"అదేమిటి? మొన్న సాటర్‌డేనే కదా వచ్చి వెళ్ళారు! మళ్ళీ ఇవాళే ఎలా వచ్చేశారు?" అంది సంతోషాన్ని ఆపుకుంటూ.

అతను విజయవాడలో మెడిసిన్ చదువుతున్నాడు. ఆ అమ్మాయి హైదరాబాద్‌లో బి. యస్సీ, చదువుతూంది. వచ్చే వేసవిలో వాళ్ళిద్దరికీ పెళ్ళి నిశ్చయం చేశారు పెద్దవాళ్ళు. ఈ లోగా విరహాన్ని ఆపుకోలేక వారాని కో సారి వచ్చి చూసి వెళ్తుంటాడు రవీంద్ర.

"పొద్దున అలా బజారులోకి వెళితే హైదరాబాద్ బస్సు రెడీగా కనపడింది, సునయనా! హైదరాబాద్ వెళ్ళే బస్సు చూస్తేనే నాకు దిగులుగా ఉంటుంది. నన్నొక్కణ్ణే విజయవాడలో వదిలేసి అందరూ షికారుగా హైదరాబాద్ వెళ్ళి పోతున్నట్లు జెలసీ కలుగుతుంది. అందుకని నేనూ బస్సు ఎక్కేశాను. వేరే బట్టలు కూడా తెచ్చుకోలేదు" అన్నాడు.

ఆ మాటలు వినగానే అతని మీద అంతులేని అభిమానమూ, అదుపులేని కోపమూ, ఆపుకోలేని నవ్వూ—మూడూ ఒక్కసారిగావచ్చేశాయి సునయనకి. ఇష్టంగా అతని వైపు చూసింది. తెల్ల గేబర్డిన్ పాంట్‌మీద ఎర్ర చెక్స్ షర్ట్ టక్ చేశా డతను. ప్రయాణంలో పాంటు హిప్స్ దగ్గరా, మోకాళ్ళ దగ్గరా బాగా మాసిపోయింది. విశృంఖలంగా ఉండే ఉంగరాల జుట్టు మొహం మీద పడుతూంది. మాసిన బట్ట లేసుకున్న మన్మథుల్లా ఉన్నా డతను.

"ఇలా అయితే ఇంకా ఎనిమిది నెలలు ఎలా ఆగుతారు? పొద్దస్తమానం ఇలా వచ్చేస్తుంటే చదువు పాడై పోదా మరి?" అంది.

"అయితే నీకు నేను గుర్తు రానా అస్సలు?" అన్నాడు రవీంద్ర కోపంగా.

"పనేమీ లేకుండా తీరిగ్గా కూర్చున్నప్పుడు మీరు గుర్తొస్తారు. కానీ చదువుకుంటున్నప్పుడు మాత్రం మీరు గుర్తొచ్చినా మనసులో నుంచీ బయటికి పంపేస్తూ ఉంటాను."

"ఏమిటీ! మెడ పట్టుకు బయటికి గెంటేస్తూ ఉంటావా? దటీజ నాట్ లవ్!" అన్నాడు రవీంద్ర, తల అడ్డంగా ఊపుతూ.

నవ్వింది సునయన. "మరేమిటి లవ్ అంటే? క్లాసు లెక్కెట్టే వారానికి రెండు సార్లు హైదరాబాద్ వచ్చేయటం కాబోలు!"

"రైట్! వాదన వద్దు. రాత్రి బస్సుకి నేను వెళ్ళిపోతున్నాను. కానీ ఈ లోగా మనిద్దరం కలిసి ఫస్ట్ షో చూసేస్తాం. సరి పాత పిక్చ రొకటి ఆడుతూంది. హాలంతా ఖాళీగా ఉంటుంది. ఓ కే?"

"ఇంకా నయ్యం! బుద్ధి ఉన్న ఏ ఆడపిల్లా మీతో సినిమాకు రాదు!" అంది సునయన. సినిమాలో లైట్లు ఆరిపోయాక అతడి చిలిపి చేష్టలని కంట్రోల్ చెయ్యడం అసాధ్యమని ఆ అమ్మాయికి అనుభవ పూర్వకంగా తెలుసు. క్రితం సారి అతనితో కలిసి వెళ్ళినప్పుడు ఒక్క క్షణంకూడా స్క్రీన్ వైపు చూడనివ్వ లేదు తనని. 'మీ చేతులని మీ ఒళ్ళోనే పెట్టుకోండి!' అని తను చాలా సార్లు వారించింది. వింటేనా! ఆ క్రితం రోజే వేసుకున్న గాజులు నాలుగు విరిగి పోయాయి. చెయ్యి అరంగుళం మేర కమిలి పోయింది. జుట్టు రేగి పోయింది.

దాచినా దాగని గుర్తులవి. ఇంటికి తిరిగి వచ్చాక అమ్మ తన వైపు అనుమానంగా, కోపంగా చూసి, ఆ రోజంతా సరిగా మాట్లాడక పోవడం ఇంకా గుర్తుంది తనకి.

"లక్షణంగా నాతో కలిసి మా ఇంటికి వచ్చెయ్యండి. మంచి కాఫీ ఇస్తుంది అమ్మ. తాగుతూ కబుర్లు చెప్పుకుందాం. సరేనా?"

"మీ ఇంటికి వస్తే కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకోవచ్చు కానీ, నిన్ను తాకుతూ కూర్చుని, నీ అందాన్నీ కళ్ళతో తాగెయ్యడానికి వీలుండదు."

ఆమె క్లాస్‌మేట్స్ నలుగురు అటు వైపు వచ్చి, 'మీ సంగతి మాకు తెలుసులే!' అన్నట్లు నవ్వు మొహాలతో చూసి వెళ్ళిపోయారు.

## మైనంపాటి భాస్కర్

"అందరూ మనల్నే చూస్తున్నారు" అంది సునయన, ఇబ్బందిగా.

"అవును! రేప్పొద్దున వీకే టాటాకులు కడతారు. అందుకని నో ప్రియతమా! ఇక్కడ నిలబడొద్దు. నాతో వచ్చెయ్!"

నిస్సహాయంగా చూసింది సునయన. "దీన్నే బ్లాక్ మెయిలింగ్ అంటారు! సరే! గోపీలో ఒక్క కప్పు కాఫీ తాగి వెళ్ళి పోదాం! సినిమా గినిమా లేదు."

"అది అజెండాలో తరవాత చర్చించవలసిన ఐటెమ్! ముందు కాఫీకి పద!" అన్నాడు రవీంద్ర హుషారుగా.

అమ్మ కోప్పడుతుందేమో అన్న భయంతో అప్పటిదాకా సందేహించిన సునయన అతనితో కలిసి కాసేపు టైం స్పెండ్ చెయ్యాలి అన్న నిర్ణయానికి ఒకసారి వచ్చేశాక, ఇంక సరదా మూడ్‌లో పడిపోయింది.

రోడ్డు దాట బోయే ముందు, అక్కడే ఉన్న పెద్ద మళయాళం సినిమా హోర్డరు మీద పడింది రవీంద్ర దృష్టి. రాత్రి, అమ్మాయి, కామం లాంటి పదాల కాంబినేషనుతో ఏదో పేరు.

ఆ పోస్టరులో అమ్మాయి ఉత్త బ్రా వేసుకుని పడుకుని ఉంది. ఒక మగాడు ఆమె చీరెని రెండు చేతులతో లాగేస్తున్నాడు. అరమోడ్పుగా ఉన్నాయి ఆ అమ్మాయి కళ్ళు.

ఆ సినిమా హోర్డరుకిందే నిలబడి రాంగ్ సైడ్ వచ్చిన ఒక సైక్లిస్టుతో మాట్లాడుతున్నాడు ఒక పోలీసు కానిస్టేబిల్. ఆ బోర్డు పక్కనుంచీ వెళుతున్న ఆడపిల్లలు తల వంచుకుని గబగబ నడుస్తున్నారు.

జుగుప్సగా మొహం పక్కకితిప్పుకుంది సునయన. "ఇంత వల్గర్‌గా ఉన్న పోస్టర్లు నడి రోడ్డులో పెడితే నడిచి వెళ్ళే ఆడవాళ్ళకి ఎంత ఇబ్బందిగా ఉంటుందో!" అంది చిరాగ్గా.

"సినిమాలకి సెన్సార్ షిప్ ఉంది గానీ, పోస్టర్లకి లేదు కదా?"

"ఆఫ్‌కోర్స్! పోస్టర్లకి సెన్సారింగ్ లేకపోవచ్చు. కానీ పబ్లిక్ డీసెన్సీని దృష్టిలో పెట్టుకుని వీటిని తీసేయించ వచ్చుగా. అమెరికాలో లాగాఎక్స్ సర్టిఫికేట్ ఇచ్చి అదుపులేనంత శృంగారం సినిమా హాల్సులో చూపించుకోమనండి. ఇష్టం ఉన్నవాళ్ళు చూస్తారు. అంతేగానీ నడిరోడ్డు మీద తలెత్తుకో లేకుండా ఇదేమిటి?"

"చీర విప్పేసి, లంగా బ్రాసరీతో పడుకుంటే నువ్వు అంతా ఆ సెక్సు హీరోయిన్ లెక్క ఉంటావ్ పిల్లా!" ఆకస్మికంగా వినిపించిన ఈ మాటలు అన్నది రవీంద్ర కాదు!

ఇద్దరూ చటుక్కున వెనక్కి తిరిగిచూశారు.

నల్లగా యముడి వాహనం లాగా ఉన్న ఒక మనిషి అలాంటి మరొక నలుగురితో కలిసి ప్రక్క నుండి వెడుతున్నాడు.


"ఏం పర్సనాలిటీ, యార్! మొన్న రాత్రి కేబరే డాన్సు చేసిన పిట్ట ఇట్లానే ..." అంటున్నా డతను.

అతను యథేచ్ఛగా చేస్తున్న కామెంట్సు కానిస్టేబుల్‌తో సహా అక్కడ ఉన్నవాళ్ళందరికీ వినబడుతూనే ఉన్నాయి.

ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో రవీంద్ర పెదిమలు ఒణికాయి. ఆ దున్నపోతుని ఎదుర్కోవడం అసంభవం అని తెలుసు అతనికి.

"పోలీసులకి రిపోర్ట్ చేద్దామా?" అన్నాడు సునయనతో.

ఈ లోపలే ఆ గూండా ఎదురుగుండా ఉన్న పోలీసుని చూసి, "నమస్తే, మామా!" అని విష్





చేశాడు.

"నమస్తే! నమస్తే! మంచిగున్నావా?" అని ఆప్యాయంగాపలకరించాడు కానిస్టేబులు. వాళ్ళిద్దరికీ మామా, అల్లుళ్ళ సంబంధం లాంటి మామూళ్ళ సంబంధం ఉంది.

ఇంక అతనికి రిపోర్టు చేసే ప్రయత్నం విరమించి, గబగబ ముందుకి నడిచారు సునయనా, రవీంద్రా. ఒక వంద గజాలు నడిచేదాకా మళ్ళీ మామూలు మూడ్‌లోకి రాలేకపోయారు వాళ్ళు.

దాదాపు ఆమెమీద వాలిపోయి నడుస్తున్నాడు రవీంద్ర.

"పైసా టవర్‌లా అలా నా మీద వాలిపోతూ నడవక్కర్లేదు. ఇది రోడ్డు. కాస్త దూరంగా నడవొచ్చు మీరు!" అంది సునయన.

"ఎక్కడికి జరగను? ఫుట్‌పాత్ అంతా నీ దెవడో ఆక్రమించేసుకుంటే?"

నిజంగానే ఫుట్‌పాత్ అంతా ఆక్రమించేసి, చిన్న షామియానా లాంటిది వేశాడొకడు. స్త్రీ, పురుష శరీర నిర్మాణాన్ని పొరలు పొరలుగా విడదీసి వివరించడానికి వీలుగా ఉండే బొమ్మలూ, సీసాల్లో ముదురు రంగు ద్రవాలూ అమర్చి ఉన్నాయి. ఒక కోరమీసాల వాడు కూర్చుని మైకులో చెబుతున్నాడు.

"పురుషుడు తన జీవితంలో జరిపే అతి ముఖ్యమైన పోరాటం పడక గదిలో శయ్యమీదే జరుగుతుంది. అందులో వోడిపోయి, స్త్రీ ముందు తలవంచు తున్నారా? పరేశాన్ కావద్దు. హిమాలయాల్లో ఉండే మా గురూజీ ఇచ్చిన మూలికలతో ఎలక్ట్రిక్ మిషను మీద చేసిన ఈ మందు ..."

మోటుగా, అశ్లీలంగా మైకులో వినబడుతున్న ఆ ప్రచారానికి సునయన ఒళ్ళు కంపరమెత్తిపోయింది.


మెడిసిన్ చదువుతూ శరీర ధర్మాలూ, శరీరానికొచ్చే అనారోగ్యం, అది నివారించే పద్ధతులూ తెలిసిన రవీంద్ర భరించలేకపోయాడు. "వీడు చెబుతున్న దంతా సైన్సుకి వ్యతిరేకమే! లాటుగా మూడు నేరాలు చేస్తున్నాడు వీడు! ఒకటి—లైసెన్సూ, రిజిస్ట్రేషనూ లేకుండా నాటుబాంబు ల్లాంటి మందులమ్మడం. రెండు — ఫుట్‌పాత్‌ని ఆక్రమించుకుని ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించటం. మూడోది— పర్మిషన్ లేకుండా లౌడ్‌స్పీకరు పెట్టి న్యూసెన్సు క్రియేట్ చెయ్యడం. పోలీసులేం చేస్తున్నారు? నిద్రపోతున్నారా?" అన్నాడు మండిపడుతూ.

అల్లంత దూరంలో ఇరానీ హోటలు ఎదుట పోలీసు వాను నిలిచి ఉంది. దాని వెనకాలే నిలబడి నలుగురు పోలీసులు తమలో తాము ఏదో మాట్లాడుకుంటున్నారు.

అసహనంగా హోటలు వైపు నడిచారు సునయన, రవీంద్రులు.

హోటల్లో ఒక మూలగా ఉన్న టేబుల్ దగ్గర కూర్చున్నారు. బాగా ఉక్క పోస్తోంది.

కూర్చోగానే షర్టు పై గుండీలు మూడూ విప్పేసి 'ఉఫ్' అని వూదుకున్నాడు రవీంద్ర. ఛాతీ మీదంతా దట్టంగా వెంట్రుక లున్నాయి.




"ఒక్కోసారి మీ మగాళ్ళని చూస్తే నాకు జెలసీగా ఉంటుంది. "లోపల బనీను కూడా వేసుకోకుండా ఎంత స్వేచ్ఛగా తిరిగేస్తున్నారో!" అంది సునయన. ఆ అమ్మాయి జాకెట్ చేతుల దగ్గరంతా స్వేదంతో తడిసిపోయింది.

సునయన జాకెట్ వైపు తదేకంగా చూశాడు రవీంద్ర. పమిట సవరించుకుంది సునయన. 'ఏమి టా చూపు?" అంది చిరుకోపంగా.

"పాపం! నీ జాకెట్‌ని చూస్తే నాకు జాలి ...!

"ఏం పాపం?

"మొయ్యలేనంత భారాన్ని మోస్తూ, ఇరవై నాలుగు గంటలూ టెన్షన్‌ని భరిస్తూ, ఆటు, పోట్లని తట్టుకుంటూ ..."

"ఛీ ... ఇంక అంతటితో విరమించండి."

"ఏమిటీ?" అన్నాడు రవీంద్ర నవ్వుతూ.

"ఇంక విరమించమన్నాను."

చెవులు గట్టిగా నులుముకున్నాడు రవీంద్ర. "ఏమిటో! చెముడొచ్చేస్తున్నట్లు ఉంది! మొదటి అక్షరాలు సరిగా వినబడటమే లేదు."

ఎవరూ చూడకుండా హాండ్ బాగ్‌తో అతన్ని కొట్టింది సునయన. "ఏమిటా మోటు మాటలు?"

"ఇవే మోటు మాట లనుకుంటే నువ్వు ప్రబంధాలు చదివి తీరాలి. వాళ్ళు రాసిన పుష్పలావిక వర్ణనలూ, రతి వర్ణనలతో పోలిస్తే నే నెంతటి వాడిని!" అన్నాడు రవీంద్ర వినమ్రంగా.

ఒక్కసారి కోపంగా చూసి, నవ్వేసింది సునయన.

కాఫీ తాగి బయటికి వచ్చారు.

ఎదురుగా మొక్కజొన్న పొత్తుల బండీ కనబడింది.

"మొక్కజొన్న పొత్తులు నీకు చాలా ఇష్టం కదా— తింటావా?" అన్నాడు రవీంద్ర.

చటుక్కున ఆగిపోయింది సునయన.

"అలా మీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడేస్తూ ఉంటే అస్సలు నేను రాను! ఇంటి కెళ్ళిపోతాను నేను."

తెల్లబోయాడు రవీంద్ర. "ఎలా మాట్లాడాను?"

"ఆ! ఏం తెలీనట్లు!"

తను అన్న మాటలని మళ్ళీ తరిచి చూసుకుని, పెద్దగా నవ్వాడు రవీంద్ర. "మొక్కజొన్న పొత్తులు తింటావా అంటే తప్పా? నీ దగ్గర శ్రీరామ అంటే బూతు లాగుందే! ఓ కే! లెటజ్ హావ్ యాపిల్స్! యాపిల్స్ కొనుక్కుని పబ్లిక్ గార్డెన్‌లో తిందాం. నా కిష్టం!" అన్నాడు పళ్ళ బండీ వైపు నడుస్తూ.

"అదిగో! మళ్ళీ అవే మాటలు!" అంది సునయన చురచురా చూస్తూ.

"మై గాడ్! ఈ లెక్కన ఐస్‌క్రీం కోన్ తిందామన్నా, ఆకాశం నీలంగా ఉందన్నా, గార్డెన్ బాగుందన్నా నువ్వు అపరకాళిలా చూడొచ్చు! అసలు నీదే డర్టీ మైండ్! నే నేం అన్నా నీకు తప్పుగానే కనపడుతుంది. ఒక జోక్ చెప్పనా?"

"వద్దు!" అంది సునయన తక్షణం.

అయినా వినిపించుకోకుండా చెప్పడం మొదలెట్టాడు రవీంద్ర. "ఒకానొక సైకియాట్రిస్టు గారు పేషెంటుని చెకప్ చేస్తూ ఒక వృత్తం గీసి, 'ఇది చూస్తే నీ కేం గుర్తొస్తోంది?' అని అడిగాడుట.

'సెక్స్' అని జవాబిచ్చాడు పేషెంటు.

సైక్రియాట్రిస్టు రెండు వృత్తాలు గీశాడు. 'ఇప్పుడు?'


'సెక్సే!' అన్నాడు పేషంటు తడుముకోకుండా.


సైకియాట్రిస్టు వరసగా ప్లస్ గుర్తు, ఇంటూ గుర్తూ, మైనస్ గుర్తూ వేశాడు.

ప్రతి దానికీ సెక్సేఅని జవాబుచెప్పాడు పేషెంటు.

'నీకు దేన్ని చూసినా సెక్స్ తప్ప మరేం గుర్తు రాదా?' అన్నాడు సైకియాట్రిస్టు చిరాగ్గా.

పేషెంటు మండిపడి, 'మీరే అన్నీ బూతు బొమ్మలు గీస్తూ నన్ను తప్పు పడతారేమిటి?' అని లేచి వెళ్ళిపోయాడు. అలాగే వో అమ్మడూ! నీకూ ఏ మాట విన్నా సెక్సే గుర్తొస్తోంది. యూ నీడ్ సైకో' అనాలిసిస్!"




ఒకసారి అతన్ని మింగేలా చూసి, మాట్లాడకుండా నడవడం మొదలెట్టింది సునయన. కానీ ఆమె పెదిమలు నవ్వుతో అరవిచ్చుకునే ఉన్నాయి.

పబ్లిక్ గార్డెన్‌లోకి వెళ్ళాక మామూలుగా ఉన్న ఒక చెట్ల గుబురు పక్కన స్థలం సెలెక్ట్ చేశాడు రవీంద్ర.

పక్కనే ఉన్న మరో చెట్ల గుబురు దగ్గర అలికిడి అయింది. తిరిగి చూశారు.

ఒక స్త్రీ. చౌకరకం నైలాన్ చీర కట్టుకుని ఉంది. పెదిమలకి చీప్ లిప్‌స్టిక్కు. బజారు మనిషని చూడగానే అర్థమై పోతూంది.

చూస్తూ ఉండగానే, ఒక కాసనోవా లాంటి రసికుడు ఆమె దగ్గిరికి వచ్చాడు. ముందు సైగలు. తరవాత మాటలు.

అది గమనిస్తున్న సునయనకి అసహ్యం కలిగింది. ఇంత విచ్చల విడిగా వ్యభిచారం జరిగి పోతుంటే అరికట్టే వాళ్ళే లేరా?

నే నున్నానూ! అన్నట్లు హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షమయ్యాడు ఒక కానిస్టేబిల్.

అతన్ని చూడగానే ఆ స్త్రీ సిగ్గు పడింది. కానిస్టేబిల్ సరసంగా ఏదో అని వెళ్ళి పోయాడు.

"ఇక్కడ కూర్చోబుద్ధి పుట్టడం లేదు. వెళ్ళి ఆ మూల, జనం లేని చోట కూర్చుందాం" అన్నాడు రవీంద్ర.

"దొంగల్లాగా జనాన్ని తప్పించుకుంటూ ఎక్కడో మారుమూల దాక్కోవడ మెందుకూ?" అంది సునయన నవ్వాపుకుంటూ.

"నవ్వకు! నువ్వు నవ్వితే ముత్యాలూ, రత్నాలూ రాలుతాయి. మనం స్మగ్లర్లమనుకుని పోలీసులు అరెస్టు చెయ్యొచ్చు."

"నిజంగా మనం స్మగ్లర్లమే అయితే పోలీసులు అరెస్టు చెయ్యరు. మనతో స్నేహం చేస్తారు!"

"కరెక్టే!" అన్నాడు రవీంద్ర. "దొంగలతో కలిసిపోయి తోడుదొంగల్లాగా తయారయ్యారు వీళ్ళు! తమాషా చూశావా? మీ కాలేజీ దగ్గర నుంచీ ఈ పబ్లిక్ గార్డెన్‌కి వచ్చే రోడ్డుమీదే సెక్రెటేరియట్, ఇన్‌స్పెక్టర్ జెనరల్ ఆఫ్ పోలీస్ ఆఫీసూ, అసెంబ్లీ, ఆలిండియా రేడియో, పోలీస్ కంట్రోల్ రూమూ ఇన్ని ఉన్నాయి. రాజధానిలో రాజమార్గం లాంటిది ఇది. అయినా ఈ రోడ్డు మీదే బూతు పోస్టర్లు కనపడతాయి. ఈవ్ టీజర్లు నిర్భయంగా ఆడపిల్లల్ని ఏడిపిస్తున్నారు. నాటు వైద్యులు రోడ్డుకి అడ్డంగా కూర్చుని భయంకరమైన మందు అమ్ముతున్నారు. కంట్రోల్ రూము ఎదురుగా పబ్లిక్ గార్డెన్ దగ్గర వ్యభిచారం అంటూ ఈ మధ్య పేపర్లో రాశారు."

తల పంకించింది సునయన. "పొలిటీషియన్స్‌కి లాగే పోలీసులకికూడా యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌తో లాలూచీలు ఉంటాయన్నది అందరికీ తెలిసిన రహస్యమే అయినా ఏమీ చెయ్యలేక, 'మన దురదృష్టం' అని నోరుమూసుకుని ఉండి పోతున్నారు జనం. పోలీసులు గూండాగాళ్ళతో చెట్టాపట్టాలు వేసుకు తిరిగినా ఫరవాలేదు. వీళ్ళు జులుం అంతా మామూలు మనుష్యులమీదే!"

కాస్సేపు మౌనం.

కొద్దిగా పక్కకి తిరిగి కూర్చుని ఉంది సునయన. లావుగా, ఒత్తుగా ఉన్న ఆమె జడ చనువుగా ఆమె మెడనీ, వీపునీ, నడుమునీ, పిరుదులనీ స్పృశిస్తూ "చూడు నా గొప్ప!" అన్నట్లు గర్వంగా చూస్తూ ఉండటం రవీంద్రకి దుర్భరమైన అసూయని కలిగించింది. ఆమె చీరె అంచు కింద దోబూచులాడుతూ ఆమె పాదాలని చుట్టేసి ముద్దెట్టుకుంటున్న పాలనురుగు లాంటి తెల్ల లంగాకూడా అతనికి అసూయని కలిగించింది.

"నీ జడా, నీ పరికిణీ—ఇవన్నీ ఎంత పుణ్యం చేసుకున్నాయో! నేనుకూడా బోలెడన్ని పుణ్యకార్యాలు చేసి, వచ్చే జన్మలో నీ గుండెల మీద పుట్టుమచ్చగా పుడతాను" అన్నాడు తమకంగా.

వెక్కిరింపుగా తల ఊపింది సునయన.

అందమైన పువ్వులాంటి సునయన మోహాన్ని, అందులో మధువు ఊరుతున్న పెదిమలనీ చూసి మోహంతో దగ్గిరికి వచ్చింది ఒక సీతాకోకచిలుక. ఆమె బుగ్గమీద వాలబోయి, ఆ నునుపుకి కాలు జారి కింద పడిపోయింది.

ఉలిక్కి పడి, వెనక్కి జరిగింది సునయన. సీతాకోకచిలుక ఆమె పమిట కొంగు కింద చిక్కుకుపోయింది.

"అరెరె!" అంటూ పమిట చేత్తో పట్టుకుని దులిపాడు రవీంద్ర.

సీతాకోకచిలుక రెక్కలు అల్లల్లార్చి, ఎగిరి పోయింది.

"అది ఎగిరి పోయింది. మీ రింక నా పమిటను వదలొచ్చు" అంది సునయన—అసలే పెద్దవైన తన కళ్ళను మరింత పెద్దవి చేసి బెదిరింపుగా చూస్తూ.

రవీంద్ర నవ్వుతూ ఏదో అనబోయేటంతలో అతని మెడ మీద బలంగా ఒక చెయ్యి పడింది.

"ఏం హీరో! సరసాలాడ్డానికి పబ్లిక్ గార్డనే దొరికిందా మీకు? చల్! వడవండి వాన్ దగ్గిరికి!" అన్నాడు, ఇందాకా వేశ్యను పలకరించిన పోలీసు కానిస్టేబుల్.

నిశ్చేష్టులై పోయారు సునయనా, రవీంద్ర.

ఒక్క గుటక మింగి—"చూడండి! ఈ అమ్మాయి నాకు కాబోయే భార్య" అనబోయాడు రవీంద్ర.

"భార్యనా? ఆ సంగతి రేపు కోర్టులో చెప్పు! రాత్రికి ఠాణాలో ఉండాలి మీరు! యాడికెల్లి కొట్టుకొచ్చినవ్ పిల్లని?" అన్నాడు కానిస్టేబుల్ మోటుగా, సునయన చెయ్యి పట్టుకుంటూ.

• • • •

పబ్లిక్ గార్డెన్ నుంచి కంట్రోల్ రూము వైపు వస్తుంటే—"మేము మీ స్నేహితులం. మే ఐ హెల్ప్ యూ?" అని పోలీస్ టవర్ వద్ద రాసి ఉన్న అక్షరాలు సునయనను, రవీంద్రను చూసి విరగబడి నవ్వాయి.

*